సాక్షి
ఖమ్మం
శుక్రవారం । 5 । సెప్టెంబర్ । 2025



డబ్బులు ఇస్తేనే 'సదరమ్'

దివ్యాంగులకు సదరమ్ సర్టిఫికెట్ల జారీలో కొందరు సిబ్బంది డబ్బు డిమాండ్ చేస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది. 8లో



ఎనిమిది 'సోలార్' గ్రామాలు

జిల్లాలోని ఎనిమిది గ్రామాల్లో సోలార్ వెలుగులు పంచేందుకు పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు రెడ్‌కో మేనేజర్ తెలిపారు. 8లో



వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలవుతుంది. మధ్యాహ్నానికి మరింత పెరిగి సాయంత్రం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

ఒకరి రక్తదానంతో ముగ్గురికి ప్రాణం



రక్తదాతలను అభినందిస్తున్న డీఎంహెచ్‌ఓ, మేయర్

ఖమ్మంవైద్యవిభాగం/ఖమ్మం మామిళ్లగూడెం: ఓ వ్యక్తి రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న ముగ్గురి ప్రాణాలను కాపాడొచ్చని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కళావతిబాయి తెలిపారు. ముస్తఫానగర్ పీహెచ్‌సీ వద్ద వికాస తరంగిణి, రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని మేయర్ పి.నీరజతో కలిసి డీఎంహెచ్‌ఓ ప్రారంభించి మాట్లాడారు. అన్నిదానాల్లోకెల్లా రక్తదానం విలువైనదని గుర్తించి ఆరోగ్యవంతులైన వారు ముందుకు రావాలని కోరారు. ముస్తఫానగర్ మెడికల్ ఆఫీసర్ రమేష్, ఉద్యోగులు చామంతి, ప్రసాద్, శైలజ కూడా రక్తదానం చేయగా 38యూనిట్ల రక్తం సేకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. వికాస తరంగిణి చైర్మన్ పోలా శ్రీనివాస్, రెడ్‌క్రాస్ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రమోహన్, సూర్యప్రకాశ్, ఉద్యోగులు సత్యనారాయణ, ఖాదర్‌బీ, వీరబాబు, గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డీఎంల బదిలీ

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్టీసీలో పలువురు డిపో మేనేజర్లను బదిలీ చేస్తూ యాజమాన్యం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. జాబితాలో ఖమ్మం రీజియన్‌లోని ఖమ్మం, సత్తుపల్లి, కొత్తగూడెం, భద్రాచలం మేనేజర్లు ఉన్నారు. ఖమ్మం డిపో మేనేజర్ దినేష్‌కుమార్ కామారెడ్డి డీఎంగా, మహబూబాబాద్ డిపో మేనేజర్ ఎం.శివప్రసాద్ ఖమ్మం డీఎంగా, సత్తుపల్లి డీఎం యూ.రాజ్యలక్ష్మి కొత్తగూడెం డీఎంగా, నల్లగొండ డిపో సీఐ వి.సునీత పదోన్నతిపై సత్తుపల్లి డీఎంగా బదిలీ అయ్యారు. అలాగే, కొత్తగూడెం డీఎం ఎం.దేవేందర్ గౌడ్‌ను వనపర్తికి, భద్రాచలం డిపో మేనేజర్ బి.తిరుపతి హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలో లా విభాగానికి బదిలీ కాగా, మహబూబ్‌నగర్ డిపో అసిస్టెంట్ మేనేజర్(మెకానికల్) పి.జంగయ్య పదోన్నతిపై భద్రాచలం డీఎంగా రానున్నారు.

కార్యదర్శుల బదిలీలపై స్టే

ఖమ్మంవ్యవసాయం: పీఏసీఎస్‌ల కార్యదర్శుల బదిలీపై హైకోర్టు స్టే ఇచ్చింది. బదిలీలపై పలువురు హైకోర్టును ఆశ్రయించగా ప్రస్తుత స్థానాల్లోనే కొనసాగించాలని గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా డీసీసీబీల పరిధిలో కార్యదర్శులను బదిలీ చేయగా, ఖమ్మం డీసీసీబీ పరిధిలో 69మందికి స్థానచలనం కల్పించారు. దీనిపై వివిధ జిల్లాల వారితో పాటే ఖమ్మం కార్యదర్శులు 35మంది కోర్టును ఆశ్రయించగా స్టే వచ్చింది. ఫలితంగా మొత్తం ప్రక్రియ ఆగిపోయినట్లేనని భావిస్తున్నారు. ఈ అంశంపై డీసీసీబీ సీఈఓ వెంకట ఆదిత్యను కలిసి బదిలీల్లో మార్పు చేయాలని కోరారు. అయితే, కేసు విరమించుకుంటే పునః పరిశీలనకు అవకాశముందని తెలుస్తోంది.

డ్రెయినేజీ నెట్‌వర్క్‌కు రూ.110కోట్లు



కేంద్రమంత్రికి వినతిపత్రం ఇస్తున్న తుమ్మల

రఘునాథపాలెం: జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న రఘునాథపాలెం మండలంలోని గిరిజన తండాల్లో పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపరచేందుకు సమగ్ర సిమెంట్ కాంక్రీట్ డ్రెయినేజీల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించామని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రూ.110 కోట్ల అంచనా వ్యయంతో డీపీఆర్ రూపొందించినందున నిధులు కేటాయించాలని ఆయన కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రోఖర్‌కు గురువారం ఢిల్లీలో వినతిపత్రం అందజేశారు. నిధులు కేటాయిస్తే 37 ఆవాసాలు, తండాల్లో పారిశుద్ధ్య పరిస్థితులు మెరుగుపడతాయని, మురుగునీరు మున్నేరులో నేరుగా కలవకుండా శుద్ధి కోసం ప్లాంట్ ఏర్పాటుచేయొచ్చని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు కేంద్రం ద్వారా నిధులు కేటాయించాలని తుమ్మల ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

కమనీయం.. కల్యాణం

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి నిత్యకల్యాణ వేడుక గురువారం కమనీయంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన పూజలు చేశారు. అనంతరం బేడామండపంలో స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణ ధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు నిర్వహించారు.

ఎమ్మెల్యే సార్!

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: పిల్లలకు ఆరంభంలోనే క్రమశిక్షణతో విద్యాబుద్ధులు నేర్పిస్తే వారి జీవితాల్లో వెలుగు రేఖలు వచ్చి పేదరికం తొలగిపోతుందని అంటున్నారు అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ. పూర్వాశ్రమంలో ప్రభుత్వ పీఈటీగా పనిచేసిన ఆయన ప్రస్తుతం ఎమ్మెల్యేగా అసెంబ్లీలో గళం వినిపిస్తున్నారు. నేడు(శుక్రవారం) జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యార్థిగా, ఉపాధ్యాయుడిగా, ఎమ్మెల్యేగా తన అనుభవాలను ఆయన 'సాక్షి'తో పంచుకున్నారు. ఆ వివరాలు ఆదినారాయణ మాటల్లోనే..

- విద్యార్థుల్లో స్ఫూర్తి కోసమే సూటు బూటు
- టీచర్ల భుజాలపైనే పిల్లల భవిష్యత్
- అశ్వారావుపేట ఎమ్మెల్యే ఆదినారాయణ

నేడు ఉపాధ్యాయ దినోత్సవం



విద్యార్థులతో జారే ఆదినారాయణ

ఆత్మగౌరవానికి ప్రతీక..

ఎమ్మెల్యేగా ఖద్దరు బట్టల్లో నిత్యం కనిపిస్తున్నా ఏదైనా స్కూల్‌కు వెళ్లి విద్యార్థులను కలవాల్సి వస్తే మాత్రం కచ్చితంగా పైన కోటు ధరిస్తా. కోటుతో హుందాతనం వచ్చి ఆత్మగౌరవం పెరుగుతుంది. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చిన్ననాటి నుంచి కష్టాలు అనుభవించినా ఆత్మగౌరవ ప్రతీకగా సూటు ధరించేవారు. ఎన్నో కష్టాలకు ఓర్చి ఈ స్థాయికి చేరిన నేను విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేందుకే ఫుల్‌సూట్ ధరిస్తుంటా.

బియ్యంలో పురుగులు ఏరుకుని..

మాది దమ్మపేట మండలం గండుగులపల్లి. అమ్మానాన్న చుక్కమ్మ – సత్యనారాయణకు నాలుగెకరాల పొలం ఉండేది. అయినా ఆర్థిక ఇబ్బందులు కుటుంబాన్ని వెంటాడేవి. నా చదువంతా ఆశ్రమ పాఠశాలల్లోనే సాగింది. ఐదో తరగతి వరకు అంకంపాలెం, పదో తరగతి వరకు పార్కలగండి ఆశ్రమ స్కూల్, ఇంటర్ కిన్నెరసాని స్పోర్ట్స్ కాలేజీలో చదివా. అప్పుడు ఆశ్రమ పాఠశాలలకు సరఫరా చేసే బియ్యంలో పురుగులు ఉండేవి. ప్రతీ ఆదివారం విద్యార్థులందరం పురుగులు ఏరితే ఆ తర్వాత వారం వండిపెట్టేవారు. అలా డిగ్రీ వరకు ప్రభుత్వ హాస్టళ్లలో ఉంటూ చదువుకుని ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (పీఈటీ)గా 2005లో సున్నంబట్టి స్కూల్‌లో ఉద్యోగం సాధించా.

1998లో ప్రెసిడెంట్ మెడల్..

హైస్కూల్ స్థాయి నుంచి స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో పాల్గొంటుండగా 1998లో ఒడిశాలో జరిగిన అంతర్జాతీయ స్థాయి(వరల్డ్ జంబోరి) పోటీల్లో 48 దేశాలు పోటీపడగా భారత్ నుంచి ఎనిమిది మందిమి ప్రాతినిధ్యం వహించాం. అందులో నాకు 'ఏ' గ్రేడ్ రావడంతో అప్పటి ఉపరాష్ట్రపతి కేఆర్.నారాయణ్ చేతుల మీదుగా ప్రెసిడెంట్ మెడల్ అందుకున్నా. అప్పటి నుంచే క్రమశిక్షణ, సమయ పాలన, సామాజిక బాధ్యతలు అలవాటయ్యాయి. ఇంటర్‌లో రన్నింగ్, జావెలిన్‌త్రో, హైజంప్ బాగా చేసేవాడిని. మ్యాథ్స్‌లో ఎమ్మెస్సీ పూర్తి చేసినా లెక్కల టీచర్‌గా కంటే విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పే పీఈటీగా పనిచేసేందుకే మొగ్గు చూపాను.

జీతంలో కొంత..

ఆశ్రమ పాఠశాలలో చదివే పిల్లలు ఓసారి ఇంటికి వెళ్తే మళ్లీ రావడానికి మొండికేస్తారు. అలా బడి మానేసిన విద్యార్థుల ఇళ్లకు సైకిల్‌పై వెళ్లి అవసరమైతే ఆరోజు అక్కడే ఉండి వారిని తిరిగి తీసుకొచ్చేవాడిని. ఆ పిల్లల కుటుంబ ఆర్థిక పరిస్థితి చూసి బాధేసేది. అలాంటి పిల్లల కోసం నా జీతంలో కొంత మొత్తం ఖర్చు చేసేవాడిని కూడా. అలా చేర్పించిన పిల్లలు ఇప్పుడు చదువులో రాణిస్తుండటం చూస్తే సంతోషంగా ఉంటుంది.

రాజకీయ ప్రస్థానం..

మా మేనమామ ముత్యాలు తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పని చేశారు. ఆయన ప్రోద్బలంతో 2014లో టీచర్ ఉద్యోగానికి రాజీనామా చేసి అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున అశ్వారావుపేట నుంచి పోటీ చేశా. ఆ సమయాన చుట్టూ కార్యకర్తలే ఉండేవారు. కానీ ఓడిపోయాక కేడర్ సంఖ్య తగ్గుతూ వచ్చింది. మరోవైపు ప్రభుత్వ ఉద్యోగం వదులుకున్నానని హేళన చేసేవారు. ఇది చాలదన్నట్టు ఆ ఎన్నికల్లో నాపై నెగ్గిన తాటి వెంకటేశ్వర్లు సైతం బీఆర్ఎస్‌లో చేరగా 2019 ఎన్నికల్లో టికెట్ ఆయనకే వచ్చింది. ఆ ఎన్నికల్లో గెలిచిన మెచ్చా నాగేశ్వరరావు కూడా బీఆర్ఎస్‌లో చేరడంతో పార్టీలో నేను మూడో స్థానానికి పడిపోయి పలకరించేవారు కరువయ్యారు.

రూ.5కోట్లు విద్యారంగానికే..

స్కౌట్స్‌లో పని చేయడం వల్ల చిన్నప్పటి నుంచి అలవడిన క్రమశిక్షణ, సమయపాలన నాకు అండగా నిలిచాయి. కష్టాలు ఎదురైనా నీరుగారిపోకుండా లక్ష్యం వైపు నడిచేలా దోహదం చేశాయి. దీంతో 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసి అశ్వారావుపేట నుంచి ఎమ్మెల్యేగా గెలిచాను. ఒక వ్యక్తి లేదా సమాజం ఎదుగుదలలో విద్య ప్రాముఖ్యత తెలిసిన వాడిని కాబట్టే ఎమ్మెల్యే కోటాలో వచ్చిన రూ.10 కోట్ల నిధుల్లో రూ. 5 కోట్లు విద్య మీదనే ఖర్చు పెట్టాను. ఆశ్రమ పాఠశాలల్లో నాణ్యమైన భోజనం పెడుతున్నారా లేదా అని క్రమం తప్పకుండా తనిఖీ చేస్తున్నా. ఇదే సమయాన పిల్లల భవిష్యత్ కోసం పాటుపడాలని ఉపాధ్యాయులకు సూచిస్తుంటా. ఈ ప్రాంతంలో ఉద్యాన పంటలు ఎక్కువ. అందుకే విద్యా పరిమాణాలు ఉద్యాన రైతులకు చేరువ చేసేందుకు హార్టికల్చరల్ యూనివర్సిటీని అశ్వారావుపేటలో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నా.

అంకితభావం.. ఆదర్శం 8లో

రాష్ట్రంలోనే మోడల్‌గా ఇంటిగ్రేటెడ్ పాఠశాల

- లక్ష్మీపురం పాఠశాల పనులు త్వరగా పూర్తి చేయాలి
- పనుల పరిశీలనలో కలెక్టర్ అనుదీప్



బోనకల్ : ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులపై సూచనలు చేస్తున్న కలెక్టర్ అనుదీప్

బోనకల్: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు నిర్మిస్తుండగా.. రాష్ట్రంలోనే మోడల్‌గా గుర్తింపు వచ్చేలా లక్ష్మీపురం పాఠశాల నిర్మాణం చేపట్టాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. బోనకల్ మండలం లక్ష్మీపురంలో 25 ఎకరాల్లో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవన నిర్మాణ పనులను గురువారం ఆయన అదనపు కలెక్టర్ పి.శ్రీజతో కలిసి తనిఖీ చేశారు. మ్యాప్ ఆధారంగా వివరాలు పరిశీలిస్తూ సూచనలు చేశారు. నిర్మాణంలో నాణ్యత పాటిస్తూ వచ్చే విద్యా సంవత్సరం నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంజనీరింగ్ విభాగం అధికారులు జె.బుగ్గయ్య, బి.నాగేశ్వరరావు, సురేష్, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ రమాదేవి, ఎంఈఓ దామాల పుల్లయ్య, కాంట్రాక్టర్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పాడి పశువుల కొనుగోలు



మధిరలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్, పక్కన అదనపు కలెక్టర్ శ్రీజ

మధిర: ఇందిరా మహిళా డెయిరీ లబ్ధిదారులకు పాడి పశువుల కొనుగోలు పారదర్శకంగా జరగాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. మధిర మున్సిపల్ కార్యాలయంలో పాడి పశువుల కొనుగోలుకు ఎంపిక చేసిన అధికారులు, బృందాలతో సమావేశమైన కలెక్టర్ మాట్లాడుతూ 20వేల మంది లబ్ధిదారులకు రెండు పశువుల చొప్పున 40వేల పాడి పశువులు కొనుగోలు చేయాల్సి ఉంటుందన్నారు. ఇందుకోసం ఆరుగురు చొప్పున పది బృందాలను ఏర్పాటుచేసినందున ఈ నెల 6న మొదటి విడతగా వెళ్లాలని తెలిపారు. కొనుగోళ్లు, బీమా, ఇతరత్రా అంశాల్లో లబ్ధిదారుల సూచనలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఎక్కడ పొరపాటు జరిగినా బాధ్యులపై కఠినమైన చర్యలు ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు. అదనపు కలెక్టర్ శ్రీజ, డీఆర్‌డీఓ ఎస్.సన్యాసయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నవీన్‌బాబు, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ విజయలక్ష్మి, తహసీల్దార్ రాంబాబు, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ పాల్గొన్నారు.

రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా మార్కెట్

ఖమ్మంవ్యవసాయం: రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా మిర్చి మార్కెట్ నిర్మాణాలు ఉండాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. రూ.155.30 కోట్లతో ఖమ్మం మార్కెట్‌లో జరుగుతున్న మోడల్ మిర్చి మార్కెట్ నిర్మాణ పనులను అదనపు కలెక్టర్ శ్రీజ, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. షెడ్లు, ఆర్ ఓ ప్లాంట్లు, టాయిలెట్లు, ల్యాబ్ నిర్మాణాలపై ఆరా తీస్తూ తేమ, రంగు పరీక్ష యంత్రాల ఏర్పాటు, డిజిటలైజేషన్‌పై సూచనలు చేశారు. అలాగే, హెల్త్ సెంటర్, క్యాంటీన్ ఏర్పాటు చేస్తూ రానున్న సీజన్ కల్లా అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. మార్కెట్ చైర్మన్, వైస్ చైర్మన్లు యరగర్ల హనుమంతరావు, తల్లాడ రమేష్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి అలీం, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా సుధాకర్

పాఠశాల స్థాయిలో జిల్లా నుంచి ఒక్కరే...



పిల్లలను బైక్‌పై తీసుకొస్తున్న సుధాకర్

కల్లూరురూరల్: కల్లూరు మండలం చెన్నూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు దంతాల సుధాకర్ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 51మంది ఉపాధ్యాయులను అవార్డులకు ఎంపిక చేయగా జాబితాలో జిల్లా నుంచి సుధాకర్‌కు మాత్రమే స్థానందక్కింది. చెన్నూరు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడం కోసం ఆయన స్వయంగా బడిబాట పేరిట బైక్‌యాత్ర నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ బడిలో సౌకర్యాలను వివరిస్తూ తల్లిదండ్రులను ఒప్పించారు. ఇదే సమయాన బోధనలో నూతన పద్ధతులు పాటించడం, పాఠశాల అభివృద్ధిలో పౌర సమాజాన్ని భాగస్వాములుగా చేయడం, పాఠాలను నాటికల రూపంలోకి మార్చి విద్యార్థులతో ప్రదర్శించడాన్ని సుధాకర్ అలవాటుగా మార్చుకున్నారు. అంతేకాక విద్యాభివృద్ధికి సోషల్‌మీడియా ద్వారా అవగాహన కల్పిస్తూ సమాజాన్ని జాగృతం చేస్తుండడంతో సుధాకర్‌ను రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఆయనను ఎంఈఓ పత్తిపాటి నివేదిత, వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు అభినందించారు.

ఉత్తమ అధ్యాపకులుగా ఇద్దరు...



శ్రీనివాస్



సునంద

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ విద్యాశాఖ పరిధిలో ఉత్తమ అధ్యాపకుల జాబితాలో జిల్లా నుంచి ఇద్దరికి స్థానం దక్కింది. ఖమ్మంలోని ఎస్ఆర్‌బీ జీఎన్ఆర్ కళాశాల జువాలజీ విభాగాధిపతి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.సునంద, కామర్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్, పీజీ విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ డి.శ్రీనివాస్ ఇందులో ఉన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో వీరిద్దరు ఉత్తమ అధ్యాపకులుగా ఎంపికయ్యారు. బోధనలో వినూత్న పద్ధతులు, పరిశోధనా పత్రాల సమర్పణ తదితర అంశాల ఆధారంగా వీరిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా సునంద, శ్రీనివాస్‌కు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ జకీరుల్లా, వైస్ ప్రిన్సిపాళ్లు ఏ.ఎల్.ఎన్.శాస్త్రి, డాక్టర్ సీ.హెచ్.శ్రీనివాస్, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

జిల్లాలో 220మంది ఉత్తమ ఉపాధ్యాయులు

- ఫలితాలు, ప్రవేశాల పెంపు ఆధారంగా ఎంపిక
- రేపు అవార్డుల ప్రదానం, సన్మానం

ఖమ్మంసహకారనగర్: మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఏటా సెప్టెంబర్ 5న నిర్వహించే ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. జిల్లాలోని 21 మండలాల పరిధిలో వివిధ అంశాలను బేరీజు వేసుకుని 220మందితో జాబితా విడుదల చేశారు. వీరిని ఈనెల 6వ తేదీన కలెక్టరేట్‌లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్, డీఈఓ డాక్టర్ పి.శ్రీజ సన్మానించనున్నారు.

ఎంపిక ఇలా..

ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికకు విద్యాశాఖ పలు అంశాలను పరిగణనలోకి తీసుకుంది. ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక పారదర్శకంగా జరిగేలా అదనపు కలెక్టర్ ఆదేశాలతో ఎంఈఓలు జాబితా రూపొందించారు. పదో తరగతిలో వంద శాతం / ఉత్తమ ఫలితాలు, సబ్జెక్టుల వారీగా ఎక్కువ మార్కులు అత్యధిక విద్యార్థులు సాధించడానికి కారణమైన ఉపాధ్యాయులకు జాబితాలో స్థానం కల్పించారు. అలాగే, పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడంలో కీలకంగా వ్యవహరించిన వారిని కూడా ఎంపిక చేశారు.

నిబద్ధతతో పనిచేస్తేనే వ్యవస్థ మనుగడ

- అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి
- జీపీఓల నుంచి ఆప్షన్ ఫామ్‌ల స్వీకరణ




కేక్ కట్ చేస్తున్న డీఆర్‌ఓ పద్మశ్రీ, పక్కన అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, తదితరులు

ఖమ్మంసహకారనగర్: ప్రభుత్వ ఉద్యోగులు నిబద్ధతతో పనిచేస్తేనే వ్యవస్థ మనుగడ సాధ్యమవుతుందని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇటీవల నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణత సాధించి గ్రామ పాలన అధికారులు(జీపీఓ)లుగా ఎంపికైన వారి నుంచి కలెక్టరేట్‌లో గురువారం సమావేశమైన ఆయన ఆప్షన్ ఫారాలు స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని 299 క్లస్టర్లలో రెవెన్యూ పరిపాలన పటిష్టతకు గ్రామపాలన అధికారులను నియమిస్తున్నట్లు తెలిపారు. పరీక్షలో 253 మంది ఉత్తీర్ణత సాధించగా, వీరిలో 240 మంది స్థానికులు, 13 మంది స్థానికేతరులు ఉన్నారని తెలిపారు. ఈ నియామకంతో మూడేళ్ల తర్వాత వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు రెవెన్యూ శాఖలోకి వస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా శిక్షణ కూడా ఇస్తామని అన్నారు. కాగా, శుక్రవారం సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు తీసుకోనుండగా 15 రోజుల్లో విధులలో చేరాలని అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి సూచించారు. జిల్లా కేంద్రం నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లేలా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. అనంతరం అదనపు కలెక్టర్, డీఆర్ఓ ఏ.పద్మశ్రీతో కలిసి జీపీఓలు కేక్ కట్ చేశారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ ఏఓ కె.శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

■ గ్రామపాలన అధికారులు(జీపీఓ)లుగా శుక్రవారం నియామకపత్రాలు అందుకోనున్న పూర్వ వీఆర్వోలు ఆప్షన్లు ఇచ్చారు. పెద్దసంఖ్యలో వచ్చిన వీరితో కలెక్టరేట్ సందడిగా కనిపించింది.

బిల్లు తారుమారుపై అధికారుల విచారణ

సాక్షి ఎఫెక్ట్..



రేపల్లెవాడలో విచారణ చేపడుతున్న పీడీ శ్రీనివాస్

కామేపల్లి: మండలంలోని రేపల్లెవాడలో ఓ వ్యక్తికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి అదే పేరుతో ఉన్న మరో వ్యక్తి ఖాతాలో నగదు జమ కావడంపై అధికారులు విచారణ చేపట్టారు. ఈ విషయమై గత నెల 30న 'సాక్షి'లో 'ఇందిరమ్మ బిల్లు మరొకరి ఖాతాలో!' శీర్షికన కథనం ప్రచురితమైంది. గ్రామానికి చెందిన తేజావత్ రవికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తూ ఎమ్మెల్యే చేతుల మీదుగా పత్రం అందజేయగా ఆయన పునాది వరకు నిర్మించాక రూ.లక్ష బిల్లు మంజూరు కావాల్సి ఉంది. కానీ అదే గ్రామంలో తేజావత్ రవి పేరుతో ఉన్న మరో వ్యక్తి ఖాతాలో జమ కావడం.. ఇల్లు తనకే మంజూరైనా పత్రాన్ని మరొకరికి ఇచ్చారని రెండో వ్యక్తి కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు రేపల్లెవాడలో హౌసింగ్ పీడీ శ్రీనివాస్ పర్యటించారు. పునాది నిర్మించిన వ్యక్తి పేరిట కాక నగదు జమ అయిన రవికే ఇల్లు మంజూరైందని తేల్చారు. కాగా, ఇలాంటి ఘటనే మరొకటి వెలుగు చూసింది. గ్రామానికే చెందిన గుగులోత్ రాజా ఇంటి మంజూరు పత్రం అందుకుని నిర్మాణం చేపట్టగా గుగులోత్ రాజు పేరుతో ఉన్న మరో వ్యక్తికి ముందుకు రావడంతో బిల్లు నిలిపివేశారు. ఆన్‌లైన్‌లో లబ్ధిదారుల వివరాలు నమోదు, మంజూరు పత్రాల పంపిణీలో అధికారుల నిర్లక్ష్యంతోనే ఇలా జరిగిందని పలువురు ఆరోపించారు. దీంతో నిర్మాణం చేపట్టిన వారికి మరో విడతలో వారికి అవకాశం కల్పించనున్నట్లు పీడీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రవీందర్, ఏఈఈ నాగేందర్, సౌమ్య పాల్గొన్నారు.

పెద్దాస్పత్రిలో సేవలకు అంతరాయం

- ఆర్‌ఓ ప్లాంట్ మరమ్మతుతో నిలిచిన హబ్ సేవలు
- విద్యుత్ లోపంతో సీటీస్కాన్ సేవలకూ విఘాతం



డయాగ్నస్టిక్ హబ్‌లో మరమ్మతుకు గురైన ఆర్‌ఓ ప్లాంట్

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లా కేంద్రంలోని పెద్దాస్పత్రిలో సేవలకు అంతరాయం ఏర్పడుతోంది. వ్యాధి నిర్ధారణలో కీలకమైన తెలంగాణ డయాగ్నస్టిక్, సీటీ స్కాన్ సేవలు నిలిచిపోయాయి. దీంతో రోజూ వేలాదిగా వచ్చే ప్రజల్లో కొందరు వెనుతిరుగుతున్నారు. ఇంకొందరు అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయిస్తున్నారు.

శుద్ధి చేసిన నీరు లేక...

ఖమ్మం జనరల్ ఆస్పత్రిలోని తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్‌లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారు. ఇక్కడ 1,520 రకాల పరీక్షలకు అవకాశం ఉండగా, జిల్లా నలుమూలల నుంచి 40సెంటర్ల ద్వారా ఐదు వాహనాల్లో శాంపిళ్లు తీసుకొస్తారు. పరీక్ష చేశాక సంబంధిత వ్యక్తుల ఫోన్‌కు 24 గంటల్లో నివేదిక పంపిస్తారు. ఆపై వైద్యులకు చూపిస్తే చికిత్స మొదలవుతుంది. ఇటీవల రసాయనాల కొరతతో తరచూ టెస్టులకు ఆటంకం కలుగుతోంది. ఇప్పుడు ఆర్‌ఓ ప్లాంట్ మరమ్మతుకు రావడంతో నిర్వహణ పూర్తిగా నిలిచిపోయింది. డయాగ్నస్టిక్ హబ్‌లో శుద్ధి చేసిన నీటితో పరీక్షలు చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రతీరోజు 10వేల లీటర్ల నీరు అవసరం కాగా, ఆర్‌ఓ ప్లాంట్ మూలనపడడంతో పరీక్షలు నిలిచిపోయాయి.

సీటీ స్కాన్ సేవలకు బ్రేక్

పెద్దాస్పత్రిలోని ట్రాన్స్‌ఫార్మర్ నుంచి స్కానింగ్ గదికి విద్యుత్ సరఫరా చేసే వైర్లు తెగిపోవడంతో సీటీ స్కాన్ సేవలకు అంతరాయం ఏర్పడింది. నాలుగేళ్ల క్రితం స్కానింగ్ మిషన్‌ను అందుబాటులోకి తీసుకురాగా నిత్యం 25–30 మందికి స్కానింగ్ చేస్తుంటారు. ప్రస్తుతం వైర్లు తెగడంతో బుధవారం నిపుణులను పిలిపించి మరమ్మతు చేయించాక పరీక్షలు మొదలయ్యాయి. కానీ గురువారం ఉదయంకల్లా మళ్లీ స్కానింగ్ మిషన్ ఆన్ కాకపోవటంతో సేవలు పూర్తిగా నిలిపివేశారు. దీంతో పలువురు నిరాశతో వెనుతిరిగిపోవడం కనిపించింది. ఇంకొందరు ఆర్థికంగా భారమైనా ప్రైవేట్ డయాగ్నస్టిక్ సెంటర్లకు వెళ్తున్నారు. ఈ విషయమై ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఎం.నరేందర్‌ను వివరణ కోరగా హైదరాబాద్ నుంచి నిపుణులను పిలిపించి ఆర్‌ఓ ప్లాంట్ మరమ్మతు చేయిస్తామని తెలిపారు, అప్పటివరకు ప్రత్యామ్నాయ మార్గాల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇక సీటీ స్కాన్ సేవలు కూడా త్వరలోనే అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు


విద్యార్థులకు చెక్కు అందజేస్తున్న అధికారులు

ఖమ్మంవైద్యవిభాగం/ఖమ్మం సహకారనగర్: హెచ్ఐవీ, ఎయిడ్స్, టీబీ సంబంధిత అంశాలపై హైదరాబాద్‌లో ఈనెల 2న యూత్ ఫెస్ట్‌లో భాగంగా రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఖమ్మం ఏఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు తృతీయ బహుమతి సాధించారు. జిల్లా స్థాయి లో ప్రథమ స్థానం సాధించిన దేవీశ్రీ ప్రసన్న, సమీర్‌పాషా రాష్ట్ర స్థాయికి ఎంపిక కాగా, అక్కడ తృతీయ బహుమతి గెలుచుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అడిషనల్ డీఎంహెచ్ఓ పి.వెంకటరమణ, ప్రిన్సిపాల్ ఆర్.గోవిందరావు గురువారం అభినందించారు. అధ్యాపకులు నరేష్, డి.రాణితో పాటు సత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్ట్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యాన అన్నదానం


భోజనం వడ్డిస్తున్న డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్

ఖమ్మంవ్యవసాయం: గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జిల్లా ఫారెస్ట్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యాన గురువారం ఖమ్మంలోని జిల్లా అటవీ కార్యాలయంలో మహా అన్నదానం నిర్వహించారు. వినాయక ఉత్సవాల్లో పలుచోట్ల అన్నదానం నిర్వహించడమే సాధారణమే అయినా ప్రభుత్వ శాఖ ఆధ్వర్యాన ఐక్యతా బావాన్ని పెంచే లక్ష్యంతో నిర్వహించడంపై పలువురు అభినందించారు. ఈసందర్భంగా జిల్లా అటవీ అధికారి స్వయంగా వంటలు చేయగా.. అటవీ డివిజన్ల అధికారులు, రేంజర్లు, వివిధ విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

విజయ డెయిరీ కాంప్లెక్స్‌కు టెండర్లు కరువు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం రోటరీనగర్‌లో ప్రధాన రహదారి వెంట ఉన్న విజయ డెయిరీ ఆధ్వర్యాన నిర్మించిన 10 దుకాణాల కాంప్లెక్స్‌లో అద్దెకు తీసుకునేందుకు ఎవరూ ముందుకు రాలేదు. ఒక్కో షాప్ అద్దె కనిష్టంగా జీఎస్టీ కాక రూ.25వేలుగా నిర్ణయించి టెండర్లు ఆహ్వానించారు. గతనెల 8న నోటిఫికేషన్ విడుదల చేసి ఈనెల 3వ వరకు సమయం ఇచ్చినా టెండర్లు దాఖలు కాలేదని డిప్యూటీ డైరెక్టర్ కోడిరెక్క రవికుమార్ తెలిపారు. దీంతో అద్దె సవరిస్తూ మరోసారి టెండర్ల స్వీకరణకు కలెక్టర్ అనుమతి కోరనున్నామని వెల్లడించారు.

క్రమశిక్షణతో ఉన్నతస్థాయికి చేరాలి



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అజయ్, పక్కన ఎమ్మెల్యే రాగమయి తదితరులు

కల్లూరు: ప్రతీ విద్యార్థి క్రమశిక్షణను అలవాటు చేసుకుని కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్ తెలిపారు. కల్లూరు గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో గురువారం ఇన్‌స్పైర్, ఇగ్నైట్ ఆధ్వర్యాన నైపుణ్యాభివృద్ధి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మాట్లాడుతూ అంబేద్కర్, అబ్దుల్‌కలాం వంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవడమే కాక విద్యాలయాలను ఆలయాలుగా భావిస్తే విజయం సొంతమవుతుందని చెప్పారు. ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కె.లక్ష్మారెడ్డి, రిసోర్స్ పర్సన్లు రంజిత్, యు.శ్రీరామ్, కళాశాల ప్రిన్సిపాల్ కనకదుర్గ, ఎస్ఐ హరిత, మార్కెట్ చైర్‌పర్సన్ భాగం నీరజ, తహసీల్దార్ పులి సాంబశివుడు, నాయకులు మట్టా దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	8,000	3,000
కందులు	5,900	5,500
మినుములు	5,700	5,700
ఏసీ మిర్చి	15,425	8,000
మిర్చి	8,600	6,000
పత్తి	7,625	6,711

– ఖమ్మం వ్యవసాయం


పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.19,107

అంకితభావం.. ఆదర్శం

- విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు
- ప్రభుత్వ పాఠశాలల్లో విలక్షణ పద్ధతుల్లో బోధన, శిక్షణ
- క్రీడల్లోనూ జాతీయస్థాయిలో ప్రతిభ చూపేలా తర్ఫీదు

నేడు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం



ఖమ్మం ద్రోణాచార్యుడు.. గౌస్


క్రీడాకారిణికి శిక్షణ ఇస్తున్న ఎం.డీ.గౌస్

ఖమ్మం స్పోర్ట్స్: అథ్లెటిక్స్‌లో ఉత్తమ క్రీడాకారులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా పలువురు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించేలా శిక్షణ ఇస్తున్న ఖమ్మం అథ్లెటిక్స్ అకాడమీ కోచ్ ఎం.డీ.గౌస్ అభినవ ద్రోణాచార్యుడిలా నిలుస్తున్నారు. మూడు దశబ్దాలుగా అథ్లెటిక్స్‌లో మెరికల్లాంటి క్రీడాకారులను తయారు చేయడంలో ఆయనకు ఆయనే సాటిగా నిలుస్తున్నారు. ఆయన వద్ద శిక్షణ పొందిన పలువురు పోటీల్లో సత్తా చాటడమేకాక ఉన్నత ఉద్యోగాలు సాధించడం విశేషం. ఢిల్లీలో 2010లో జరిగిన కామన్వెల్త్ క్రీడల్లో గౌస్ వద్ద శిక్షణ తీసుకున్న అబ్దుల్ ఖురేషి కాంస్య పతకం సాధిచాడు. నాటి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌లో 1993లో ఉద్యోగంలో చేరిన నాటి నుంచి 3వేల మందికిపైగా శిక్షణ ఇవ్వగా.. అందులో పది మంది అంతర్జాతీయస్థాయిలో పదికిపైగా పతకాలు సాధించారు. ఇక జాతీయస్థాయిలో ఏకంగా 400 మంది పతకాలు సొంతం చేసుకోవడం విశేషం. దాదాపు 300 మందికిపైగా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. ఎం.డీ.గౌస్ ప్రతిభకు స్పోర్ట్స్ అథారిటీ ప్రకటించిన ఉత్తమ కోచ్ అవార్డును నాటి గవర్నర్ నరసింహన్ చేతుల మీదుగా అందుకున్నాడు. ఎప్పటికైనా జిల్లా నుంచి ఒలింపిక్ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దాలన్నదే తన లక్ష్యమని చెప్పే గౌస్ కల నెరవేరాలని ఆశిద్దాం.

కట్టా.. విద్యాసేవకే జీవితం

ఖమ్మం సహకారనగర్: ఒక వ్యక్తి జీవితాన్ని మార్చే శక్తివంతమైన ఆయుధం విద్య మాత్రమేనని విశ్వసిస్తూ తన జీవితాన్ని బోధనకే అంకితం చేసిన ఉపాధ్యాయుడు కట్టా వెంకటేశ్వర్లు. ఇటీవలే ఖమ్మం ఎన్నెస్పీ కాలనీ పాఠశాలలో ఎస్ఏ(బయాలజికల్ సైన్స్)గా బాధ్యతలు స్వీకరించిన ఎక్కడ పనిచేసినా విద్యార్థుల సంఖ్య పెంపు, సౌకర్యాల కల్పన, బోధన సృజనాత్మకతే లక్ష్యంగా ముందుకుసాగుతున్నారు. 1997 జూన్ 30న గోరీలపాడు తండా పాఠశాలలో ఉపాధ్యాయుడిగా ప్రస్థానం ప్రారంభించిన ఆయన విజయ్‌రావుతో కలిసి విద్యార్థుల సంఖ్యను 50 నుండి 120కి పెంచారు. ఆ పాఠశాలలో 70కి పైగా నాటిన టేకు మొక్కలు ఇప్పుడు పెద్దవయ్యాయి. ఇక 2004లో ఖమ్మం గుట్టలబజార్ పాఠశాలకు వచ్చాక సృజనాత్మకతను జోడించి సైన్స్ మోడళ్ల బోధన ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఆపై 2011 జూన్‌లో కొత్తగూడెంకు, 2015లో ఖమ్మం సంభానినగర్ పాఠశాలకు బదిలీపై అయిన


బడిబాట కార్యక్రమంలో సహచర ఉపాధ్యాయులతో వెంకటేశ్వర్లు (ఫైల్)

వెంకటేశ్వర్లు ఆ పాఠశాలలో 95గా విద్యార్థుల సంఖ్యను 150కి చేర్చడంలో కీలకపాత్ర పోషించారు. అప్పుడే టీఎల్ఎంలో బహుమతులు సాధించారు. కాగా, ఆయన పనిచేసిన పాఠశాలల్లో దాతల చేయూతతో మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటుచేయగా, 2019లో రూ.1.20లక్షల విలువైన 75 డెస్క్ బెంచీలు సమకూర్చారు. స్వచ్ఛ భారత్ వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు రాష్ట్ర స్థాయి అవార్డు గెలుచుకునేలా మార్గనిర్దేశం చేశారు. మన ఊరు – మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలకు కావాల్సిన సదుపాయాలను సమకూర్చడానికి ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో కృషి చేశారు.

బోధన, సౌకర్యాల కల్పన.. జ్ఞాని


ఎన్నికల విధుల్లో జ్ఞానేశ్వరాచారి (ఫైల్) (ఇన్‌సెట్) జ్ఞాని

మధిర: జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా 23ఏళ్ల క్రితం ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చిన బాజోజు జ్ఞానేశ్వరాచారి ఎక్కడ పనిచేసినా బోధనతో సరిపెట్టుకోకుండా ఆ పాఠశాలలో సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నారు. ప్రస్తుతం మధిర మండలంలోని మడుపల్లి ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న జ్ఞానేశ్వరాచారి గతంలో భీమవరం, మాటూరు తదితర పాఠశాలల్లో విధులు నిర్వర్తించారు. ఆయా పాఠశాలల్లో సరైన తరగతి గదులు లేక విద్యార్థుల ఇబ్బందులను గుర్తించి సహ ఉపాధ్యాయులు బూసా కోటేశ్వరావు సహకారంతో ఎన్నారైలు, గ్రామస్తులను ఒప్పించి పాఠశాలకు రెండెకరాల స్థలం వచ్చేలా చూశారు. ఆపై అధికారుల సహకారంతో నూతన భవన సముదాయాల నిర్మాణానికి కృషి చేశారు. అంతేకాక కంప్యూటర్ పరిజ్ఞానం ఉండడంతో పాఠశాలల్లో కంప్యూటర్ బోధనకు సహకరిస్తూనే అవసరమైన మరమ్మతులు సొంతంగా చేస్తారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సందర్భంగా రెవెన్యూ ఉద్యోగులకు సాఫ్ట్‌వేర్‌పై శిక్షణ ఇస్తూ ఉన్నతాధికారుల మన్ననలు పొందారు. ఇక నిరుపేద విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు అన్ని రకాల పోటీ పరీక్షల్లో పాల్గొనేలా తర్ఫీదునిస్తారు. తీరిక సమయాన ఇంటి ఆవరణలో సేంద్రియ ఎరువులతో కూరగాయలు సాగు చేసి ఆదర్శంగా నిలుస్తున్న జ్ఞానేశ్వరాచారి.. మధిర ఎంప్లాయీస్ కాలనీలోని కుందా సావిత్రి సేవాసమితి హోమియో హాస్పిటల్‌లో వలంటీర్‌గా సేవలందిస్తున్నారు. ఇవికాక సొంతంగాతక్కువ ఖర్చుతో రూపొందించిన వాటర్ ప్యూరిఫయర్‌ను హోమియో ఆస్పత్రికి అందించారు. పాఠాల బోధనలో వినూత్న విధానాలు అవలంబిస్తూనే సేవా కార్యక్రమాల్లో ముందు నిలిచే ఆయన సతీమణి గురుకుల పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యేలా ప్రోత్సాహించారు. ఇప్పటివరకు అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోకుండా దూరంగా ఉండడం విశేషం.

పిల్లల ఉన్నతే 'మోషే' లక్ష్యం

సత్తుపల్లిటౌన్: ఆదర్శ ఉపాధ్యాయుడు ఎలా ఉండాలంటే మోషే మాదిరి ఉండాలని ముక్తకంఠంతో చెబుతారు సత్తుపల్లి మండలం బుగ్గపాడు పాఠశాల విద్యార్థులు. అంతలా వాళ్ల హృదయాల్లో ఆయన సుస్థిర స్థానాన్ని పొందారు. ఈ ఉపాధ్యాయుడి పూర్తి పేరు కోండ్రు మోషె. గతంలో వేంసూరు తదితర మండలాల్లో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించి ప్రస్తుతం బుగ్గపాడు పాఠశాలలో పని చేస్తున్నారు. బోధనలో సులభ పద్ధతులను అనుసరించే ఈయన ఆహార్యం, నడవడికలోనకు విద్యార్థులు ఆదర్శప్రాయంగా నిలిచారు. విద్యార్థులతో కలిసిమెలిసి ఆటలు ఆడతారు. వారితో మమేకమవుతూ ప్రయోగాలు చేయిస్తుంటారు. భోజన సమయంలో విద్యార్థులతోనే భోజనం చేస్తుండడంతో వారి మనస్సుల్లో స్థానం సాధించుకున్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న పాఠ్యపుస్తకాలు, వర్కుబుక్స్ విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేలా ఉన్నాయని చెప్పే ఆయన.. ఇంకొంత సృజనాత్మకతతో పాఠాలు బోధిస్తుండడం విశేషం. ఉపాధ్యాయుడు సహనం, సహానుభూతి అలవర్చుకుని.. అంకితభావంతో పని చేస్తే సత్ఫలితాలు వస్తాయని.. తరగతి గదిలో అద్భుతాలు సృష్టించవచ్చని మోషే ప్రగాఢంగా నమ్ముతారు.


పిల్లలతో కలిసి కూర్చుని పాఠం బోధిస్తున్న మోషే

డబ్బులిస్తేనే 'సదరమ్' సర్టిఫికెట్

- నగదు డిమాండ్ చేస్తున్న పలువురు
- విచారణ కమిటీ వేసిన సూపరింటెండెంట్

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సదరమ్ విభాగంలో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. దివ్యాంగులకు వైకల్య నిర్ధారణ సర్టిఫికెట్ జారీకి పలువురు డబ్బు డిమాండ్ చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. అర్హత లేకపోయినా డబ్బు ముట్టజెపితే సదరమ్ సర్టిఫికెట్ చేతులో పెడుతున్నారని, డబ్బులు ఇవ్వకపోతే కొర్రీలతో జాప్యం చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో సదరమ్ శిబిరాల నిర్వహణ ప్రత్యేక విభాగం ఉండగా ఇందులో డీఆర్‌డీఏ, ఆస్పత్రి సిబ్బంది విధులు నిర్వర్తిస్తారు. నిర్ణీత తేదీల్లో శిబిరాలు నిర్వహించే క్రమాన ముందు రోజు స్లాట్ బుక్ చేసుకున్న దివ్యాంగుల సెల్‌కు మెసేజ్ పంపడమే కాక సిబ్బంది ఫోన్ ద్వారా సమాచారం ఇస్తారు. ఆతర్వాత వైద్యులు పరీక్షించి అర్హత ఉన్న వారికి సర్టిఫికెట్ జారీ చేయడం ఆనవాయితీ. ఈక్రమంలో కొందరు సిబ్బంది దివ్యాంగులకు ఫోన్ చేసి సర్టిఫికెట్ జారీ చేసేందుకు కొంత నగదు ఇవ్వాలని సంప్రదిసున్నట్లు ఇటీవల అధికారులకు ఫిర్యాదులు అందాయి.

రూ.25వేలు ఇస్తేనే...

ఖమ్మం రూరల్ మండలంలోని వరంగల్ క్రాస్ రోడ్డుకు చెందిన ఓ వ్యక్తికి గతంలో సదరమ్ సర్టిఫికెట్ ఉంది. దీని కాలపరిమితి ముగియడంతో రెన్యువల్ కోసం గత నెల 26న క్యాంపునకు హాజరయ్యారు. ఆ శిబిరంలో ఆయన సర్టిఫికెట్ నిరాకరించారు. ఈ సమయాన సదరమ్ విభాగంలోని ఓ ఉద్యోగి ఆయనను ఫోన్‌లో సంప్రదించి రూ.25వేలు చెల్లిస్తే సర్టిఫికెట్ ఇప్పిస్తానని చెప్పినట్లు సమాచారం. దీంతో సదరు దివ్యాంగుడు ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఎం.నరేందర్‌కు ఫిర్యాదు చేయగా గురువారం ముగ్గురితో కూడిన కమిటీని విచారణకు నియమించారు. అంతేకాక దివ్యాంగుడిని పిలిపించి తన చాంబర్‌లో వైకల్య పరీక్షలు నిర్వహించగా సదరమ్ సర్టిఫికెట్‌కు అర్హత సాధించడం గమనార్హం. దివ్యాంగుల అవసరాన్ని ఆసరా చేసుకుని అక్రమాలకు పాల్పడుతున్న సిబ్బందిపై కఠినంగా వ్యవహరిస్తేనే ఈ దందాకు అడ్డుకట్ట పడుతుందని పలువురు కోరుతున్నారు.


సూపరింటెండెంట్ చాంబర్‌లో దివ్యాంగుడిని పరీక్షిస్తున్న డాక్టర్ రాంప్రసాద్

ఎనిమిది 'సోలార్' గ్రామాల ఎంపిక

నేలకొండపల్లి/ముదిగొండ: జిల్లాలోని ఎనిమిది గ్రామాలను పూర్తిస్థాయి సోలార్ వెలుగులు అందించేందుకు ఎంపిక చేసినట్లు జిల్లా రెడ్‌కో మేనేజర్ పి.అజయ్‌కుమార్ తెలిపారు. నేలకొండపల్లి, ముదిగొండలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సుల్లో ఆయన మాట్లాడారు. జిల్లాలోని తనికెళ్ల, కొణిజర్ల, తల్లాడ, అన్నారుగూడెం, వల్లభి, ముదిగొండ, నేలకొండపల్లి, కందుకూరు గ్రామాలను మోడల్ విలేజ్‌లుగా ఎంపిక చేయగా, ప్రజలకు సోలార్ ప్లాంట్లతో లాభాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. మూడు కిలోవాట్ల ప్లాంట్ ఏర్పాటు చేసుకుంటే రూ.78 వేల సబ్సిడీ అందుతుందని చెప్పారు. ఎక్కువగా ప్లాంట్లు ఏర్పాటయ్యే గ్రామాలకు రూ.కోటి ప్రోత్సాహం జారీ చేస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వచ్చే నెల 3వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని మేనేజర్ సూచించారు. ఏఈలు కె.రామారావు, ఎం.శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసరావు, సీహెచ్.రామకృష్ణ, సబ్ ఇంజనీర్ బి.రాంమోహన్, స్థానికులు పాల్గొన్నారు.


నేలకొండపల్లి : మాట్లాడుతున్న రెడ్‌కో మేనేజర్ అజయ్‌కుమార్

రేపు వైన్స్, బార్లు బంద్

ఖమ్మం క్రైం: గణేష్ శోభాయాత్ర, నిమజ్జనం సందర్భంగా ఖమ్మం కమిషనరేట్ పరిధిలో శనివారం మద్యం విక్రయాలు నిలిపేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. శనివారం ఉదయం 6నుంచి ఆదివారం ఉదయం వరకు వైన్స్, మద్యం సరఫరా చేసే బార్లు, రెస్టారెంట్లు మూసివేయాలని ఆదేశించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని పెయింటర్ దుర్మరణం

శంకర్‌పల్లి: ట్రాక్టర్ ఢీకొనడంతో ఓ పెయింటర్ మృతి చెందిన ఘటన రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం మోకిల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఖమ్మం జిల్లాకు చెందిన శ్రీపాద రామాచారి(35) – భాను దంపతులు బతుకుదెరువు నిమిత్తం పదిహేనేళ్ల క్రితం హైదరాబాద్ బాలానగర్‌లో ఉంటున్నారు. రామాచారి పెయింటర్‌గా, భాను కూలీ పనులతో జీవనం సాగిస్తున్నారు. మోకీలలో ఓ భవనానికి పెయింట్ వేస్తున్న రామాచారి బుధవారం తన తమ్ముడు లక్ష్మణ్‌తో కలిసి రాత్రి వరకూ పని చేసి అక్కడే పడుకున్నారు. గురువారం ఉదయాన్నే టిఫిన్ చేసేందుకు వచ్చి వెళ్తుండగా వెనక నుంచి అతివేగంగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనపై ఆయన భార్య భాను ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు.

ఉద్యోగుల పేరిట నగదు వసూళ్లు : నలుగురి అరెస్ట్

ఖమ్మం రూరల్: రవాణా శాఖ ఉద్యోగులుగా చెబుతూ ఖమ్మం రూరల్ మండలం ఆరెంపుల శివారులో లారీలను ఆపి డబ్బు వసూలు చేస్తున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వరంగల్ క్రాస్ రోడ్డు ప్రాంతానికి చెందిన కట్టకూర నవీన్, కూసుమంచి మండలం బోడియాతండాకు చెందిన జె.సాగర్, బారుగూడెంకు చెందిన దంతాల వెంకటనారాయణ, రెడ్డిపల్లికి చెందిన కత్తుల మోహన్‌చంద్ర ముఠాగా ఏర్పడ్డారు. వీరు రహదారులపై లారీలను ఆపి ఆర్‌టీఓ అధికారులుగా చెబుతూ డబ్బు వసూలు చేస్తున్నారు. తాజాగా తిరుమలాయపాలెంలో ఓ దాబా యజమాని నుంచి కూడా నగదు వసూలు చేశారు. సూర్యాపేటకు చెందిన లారీ డ్రైవర్ శ్రీశైలం ఫిర్యాదుతో నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ ముష్క రాజు తెలిపారు.

సుంకం రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

సంయుక్త కిసాన్ మోర్చా ఆందోళనలో బాగం హేమంతరావు

ఖమ్మంమయూరిసెంటర్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిళ్లకు తలొగ్గి పత్తిపై దిగుమతి సుంకాన్ని రద్దు చేయడం గర్హనీయమని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు బాగం హేమంతరావు ఆరోపించారు. సుంకాన్ని రద్దుచేయడంతో పత్తి ధరలు తగ్గి రైతులు నష్టపోయే ప్రమాదముందని తెలిపారు. సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు వామపక్ష రైతు సంఘాల ఆధ్వర్యాన గురువారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హేమంతరావు మాట్లాడుతూ పత్తి దిగుమతిపై సుంకాన్ని రద్దు చేసిన నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 20 లక్షల హెక్టార్లలో రైతులు పత్తి సాగు చేస్తుండగా, ప్రభుత్వ నిర్ణయంతో వీరంతా నష్టపోతారని తెలిపారు. కాగా, 11ఏళ్ల మోదీ పాలనలో వ్యవసాయ రంగంపై వివక్ష తప్ప సానుకూల స్పందన ఏనాడు కనబర్చలేదని ఆరోపించారు. అలాగే, కేంద్రం తీరుతోనే యూరియా కొరత ఏర్పడిందని మండిపడ్డారు. అనంతరం వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డికి అందించారు. వివిధ పార్టీలు, సంఘాల నాయకులు జమ్ముల జితేందర్ రెడ్డి, దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, మాదినేని రమేష్, బొంతు రాంబాబు, మలీదు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ఆందోళనలో పాల్గొన్న రైతు సంఘాల నాయకులు

ఈనెల 10న ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పర్యటన


దుర్గాప్రసాద్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.ప్రీతమ్ ఈనెల 10న జిల్లాలో పర్యటించనున్నారని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం ఎస్సీ సెల్ కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు బొడ్డు బొందయ్య అధ్యక్షతన నిర్వహించగా దుర్గాప్రసాద్ మాట్లాడారు. దళితులకు సామాజిక న్యాయం, ఆర్థిక న్యాయం చేసిన ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని తెలిపారు. ఈనెల 10న రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్, దళిత కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ప్రీతమ్ జిల్లా పర్యటన సందర్భంగా జరిగే దళిత సదస్సును విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఎస్సీ సెల్ నాయకులు ఆయనను సత్కరించారు.

జల్లేపల్లి గణేష్ లడ్డూకు రికార్డు ధర

- రూ.90,116కు దక్కించుకున్న పుసులూరి వేణు


లడ్డూతో వేణు దంపతులు, భక్తులు

తిరుమలాయపాలెం: మండలంలోని జల్లేపల్లిలో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతిష్ఠించిన వినాయకుడి చేతిలో లడ్డూకు రికార్డు ధర పలికింది. ఈమేరకు గురువారం పది కేజీల లడ్డూ వేలం నిర్వహించగా గ్రామానికి చెందిన పుసులూరి వేణు – అనూష దంపతులు రూ.90,116కు దక్కించుకున్నారు. అలాగే, మరో చిన్న లడ్డూను రాచకొండ నగేష్ రూ.17,016కు పాడారు.

మామ వేధింపులు తాళలేక బలవన్మరణం


యోషిత (ఫైల్)

ఖమ్మంక్రైం: భర్తకు సొంత బాబాయి, తనకు మామ వరుసైన వ్యక్తి లైంగిక వేధింపులు భరించలేక జిల్లా కేంద్రంలో ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడింది. ఖమ్మం శ్రీనివాస్‌నగర్ కాల్వ కట్ట ప్రాంతానికి చెందిన యోషిత (24) ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తోంది. అదే ప్రాంతానికి చెందిన బెజ్జం నవీన్‌ను ఎనిమిదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకోగా, ఆమెను నవీన్ బాబాయి, సింగరేణిలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి రామకృష్ణ లైంగికంగా వేధిస్తున్నాడు. దీనిపై భర్తకు చెప్పినా పట్టించుకోకపోగా ఆయన కుటుంబీకులు యోషితకు పిల్లలు పుట్టడం లేదని వేధిస్తున్నారు. ఇంతలోనే రామకృష్ణ తన వద్ద యోషిత ప్రైవేట్ వీడియోలు ఉన్నాయని బెదిరించడంతో మనస్తాపానికి గురైన ఆమె బుధవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఖమ్మం త్రీటౌన్ సీఐ రామకృష్ణ తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

పెనుబల్లి: మండలంలోని పాత కారాయగూడెం తండాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి గుగులోతు శిరీష(23) హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకుంది. ఇంజనీరింగ్ పూర్తిచేసిన ఆమె హైదరాబాద్‌లో మూడు నెలలుగా ఉద్యోగం చేస్తోంది. హైదరాబాద్ అమీర్‌పేటలో ఉంటున్న ఆమె బుధవారం హాస్టల్ గదిలో ఉరి వేసుకుంది. లంకసాగర్‌కు చెందిన బొడ్డు కిరణ్‌తో ప్రేమ వ్యవహారమే ఈఘటనకు కారణమని శిరీష కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. మాదాపూర్ పోలీసులు పోస్టుమార్టం అనంతరం గురువారం మృతదేహాన్ని అప్పగించగా, వీఎం బంజర్ పోలీస్‌స్టేషన్ ఎదుట అంబులెన్స్ నిలిపి ఆందోళన చేపట్టారు. ఈ మేరకు ఎస్సై వెంకటేష్ విచారణ చేపడతామని వారికి నచ్చచెప్పారు.

జీవాలు దొంగిలిస్తున్న నలుగురి అరెస్ట్

కారేపల్లి: గొర్రెపోతులు, మేకపోతులు, కోళ్ల చోరీ చేస్తున్న నలుగురిని కారేపల్లి పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. మండలంలోని ఉసిరికాయపల్లి ఓసీ సమీపాన ఎస్ఐ బి.గోపి ఆధ్వర్యాన వాహనాలు తనిఖీ చేస్తుండగా ఉసిరికాయపల్లికి చెందిన శివయ్య, సురేష్, గోపి, ప్రకాశ్ ఒకఆటో, రెండు ద్విచక్రవాహనాల్లో వస్తూ అనుమానాస్పదంగా కనిపించారు. వీరి ఆటోలో ఒక గొర్రెపోతు ఉండడంతో విచారిస్తే పలు గ్రామాల్లో మేకపోతులు, గొర్రెపోతులు, కోళ్లు చోరీ చేసి విక్రయిస్తున్నట్లు తేలింది. ఈమేరకు నిందితులను అరెస్ట్ చేశామని ఎస్ఐ గోపి తెలిపారు.

గణేష్ నిమజ్జనంలో అపశృతి

ట్రాక్టర్ పైనుంచి పడి యువకుడు మృతి


రషీద్ (ఫైల్)

వేంసూర్: గణేష్ నిమజ్జనం ఊరేగింపులో ప్రమాదం చోటు చేసుకోగా ఓ యువకుడు మృతి చెందాడు. వేంసూరు మండలం వెంకటాపురంలో బుధవారం గణేష్ నిమజ్జన శోభాయాత్ర జరుగుతుండగా షేక్ రషీద్(21) ట్రాక్టర్ నడుపుతున్నాడు. ఆయన అలిసిపోవడంతో మరో వ్యక్తికి ట్రాక్టర్ నడపమని ఇచ్చి పక్కన కూర్చున్నాడు. ఇంతలోనే డ్రైవర్ ఒక్కసారిగా ముందుకు పోనివ్వడంతో ఇంజన్‌పై కూర్చున్న రషీద్ అదుపు తప్పి కింద పడగా, ఆయన పైనుంచి టైరు వెళ్లడంతో తీవ్రగాయాలయ్యాయి. దీంతో స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. రషీద్ తండ్రి నాగుల్‌మీరా ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.